


**గేటు పైన** విశాలంగా కనిపించే ప్రభుత్వ కళాశాల బోర్డు. గేటు దాటి లోపలికి అడుగు పెట్టగానే దారి కిరువక్కలా ఆశోక, యూకలిప్ట °స చెట్లు స్వాగతం పలుకుతూ ఉన్నాయి. గేటు కెదురుగా దూరంగా కనిపించే గ్రంథాలయం, కుడి పక్కన కోకో కోర్టు కవతల సైన్సు లాబరెటరీలు, దారికి ఎడమవైపున ఫౌంటేన్ కవతల ప్రిన్సిపాల్ గది, దాని పక్కన ఆఫీసు—వీటన్నింటి చుట్టూ పేర్చినట్లున్న క్లాసు రూములు.

ఇలా అన్నీ అందంగా ఉన్న విశాలమైన కాలేజీ అవరణ అది. ఆ ఆవరణలో ఆ రోజు పరీక్ష జరుగుతోంది. అందుకేనేమో సంవత్సర కాలంనుంచీ చిరునామా లేకుండా పారిపోయిన నిశ్శబ్దమంతా ఆవేళ కాలేజీ వరండాల్లో చేరింది. విద్యార్థుల అల్లరి, కేకలు—శబ్దాలన్నీ ప్రహరీ కవతలే ఆగిపోయాయి. ప్రతి అంగుళం గంభీరతని సంతరించుకున్న ఆ ఆవరణలోని చెట్ల కదలికలు సైతం హుందాగా కనిపిస్తున్నాయి. విద్యార్థులు రాస్తున్న పేపరు కదలికలూ, ఇన్విజిలేటర్ల పాదాల చప్పుళ్ళూ మాత్రమే ఆ నిశ్శబ్దానికి కొంచెంగా భంగం కలిగిస్తున్నాయి.

ఇలాంటి వాతావరణంలో నేను ఓ పరీక్ష హాల్లో విద్యార్థులు కాపీ కొట్టకుండా కావలివాచే ఇన్విజిలేటర్ డ్యూటీ చేస్తున్నాను. ఎదుటి వాళ్ళు తప్పు చేయకుండా కావలా కాచే ఆ డ్యూటీ నిజంగా భయంకరమయింది. నాకైతే మరీ ఎక్కువ. కాని ఉద్యోగమన్నాక చేయక తప్పదు.

ఈ క్షణం డ్యూటీ చేస్తున్నానన్నమాటే కాని ఉదయం చూ°సిన దృశ్యమే కళ్ళలో తుపాకీతో పొడుస్తున్నట్టుగా ఉంది. మనస్సుని బూట్ల కిందే°సి నలిపేస్తున్నట్టుగా ఉంది. ఆ దృశ్యాన్ని చూ°సి జాలిపడాలో, కోపం తెచ్చుకోవాలో తేల్చుకోలేని °స్థితి. ఆ దృశ్యం—పోలీసుల కావలాతో నారాయణ పరీక్ష కొచ్చిన దృశ్యం—గతాన్ని కెలుకుతోంది.

ఆ దృశ్యం తన ఉద్యోగం మొదటి రోజునుంచీ జరిగిన అనేక సంఘటనల్ని ఒక్కటొక్కటిగా స్మృతిలోకి వస్తోంది...

సరిగ్గా సంవత్సరన్నర క్రితం ఈ ఉద్యోగంలోకి చేరడానికి వచ్చిన మొదటి రోజున నాలో ఎన్ని ఆలోచనలు, ఎన్ని ఆశలు! ఒకరకంగా నాకెంతో ఇష్టమైన ఈ ఉద్యోగంలో చేరే రోజున నాలో ఎంత ఉత్సాహం—ఎంత ఉద్వేగం! భావిపౌరులని తయారుచే సే బాధ్యతని తీసుకుంటున్నానని, విద్యార్థుల్లో మానవత్వాన్నీ, సుహృద్భావాన్నీ పెంపొందించబోతున్నానని—వాళ్ళని నిజమైన పౌరులుగా, ఉన్నత స్థాయి వ్యక్తులుగా తీర్చిదిద్దబోతున్నానని నమ్మి ఆనందించాను.

ఆ రోజు నుంచీ విద్యార్థుల కోసమే తపిస్తూ శ్రమిస్తూ పాఠాలు చెబుతూ వస్తున్నాను. నేను చదువుకునే కాలంలో నాకు అందుబాటులో లేని, అందని విజ్ఞానాన్ని నా విద్యార్థుల కందించాలనే తపన నన్ను అహర్నిశలూ శ్రమించేలా చే°సింది. పేద విద్యార్థులకి ముఖ్యంగా వెల్ఫేర్ హాస్టల్లో ఉండి చదువుకునే వాళ్ళంటే నా కెక్కువ మమకారం. ఆ విద్యార్థుల తల్లితండ్రులు చదువు సంధ్యలు లేక ఎక్కడో పల్లెల్లో ఉంటూ, తమ పిల్లలు చదువుకుని పైకి రావాలనే తపనతో వీళ్ళని పట్నాల్లో ఉంచి చదివిస్తూ అష్టకష్టాలూ పడతారు. అలాంటి పిల్లల పట్ల మరింత శ్రద్ధ వహించాలనే నేను మొదటి నుంచీ ప్రయత్నిస్తూ వచ్చాను.

ఆ ప్రయత్నంలోనే ఫ°స్టియర్ చదివే నారాయణ నా దృష్టిలో పడ్డాడు. నారాయణ ఇంటలిజెన్సు, ఉత్సాహం నన్ను మొదటి క్లాసులోనే ఆకర్షించాయి. చెప్పిన పాఠాన్ని అతను అర్థం చేసుకునే తీరు, వే°సిన ప్రశ్నలకి లాజికల్‌గా అతనిచ్చే జవాబులూ నన్ను చకితుణ్ణి చేశాయి. ఆ పిల్లవాడు సానబడితే మెరి°సపోతాడనిపించింది. వివరాలు తెలుసుకుంటే హాస్టలు విద్యార్థి అని తెలి°సింది. ఆ విషయం నారాయణమీద నాకు మరింత అనురాగం పెంచేలాగా చే°సింది. అలా నే నొక్కణ్ణే కాదు, కాలేజీలో మిగతా లెక్చరర్లంతా నారాయణ గురించే చెప్పేవారు. అన్ని సబ్జక్టుల్లోనూ నారాయణది ఒకే స్థాయి.

నారాయణ తప్పకుండా కాలేజీకీ, పాఠాలు చెప్పిన లెక్చరర్లకీ పేరు తెస్తాడు అని అందరూ నమ్మేవాళ్ళు.

అందరూ ఊహించినట్టుగానే నారాయణ మొదటి సంవత్సరం పరీక్షల్లో మంచి మార్కులతో పాసయ్యాడు. నారాయణ కష్టపడే పద్ధతీ, ఇంటరెస్టూ చూ స్తే మా అంచనాలను సైతం మించిపోతాడని అనుకునేవాళ్ళం.


కాని, మొదటి సంవత్సరం తరువాతి ఎండాకాలం నారాయణని మార్చే°సింది. సెలవుల్లో ఇంటికి వెళ్ళొచ్చాక నారాయణలో విపరీతమైన మార్పు కనిపించసాగింది. అతనికి క్రమంగా పుస్తకాల పట్ల శ్రద్ధ తగ్గింది. చదువులో ఆసక్తి పోయింది. క్లాసులో కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. పలకరి స్తే ఉలిక్కిపడేవాడు

ఏం నారాయణా అట్లా ఉన్నావు అని ఎన్నిసార్లడిగినా " ఏంలేదు సార్... ఏదో ఆలోచిస్తున్నాను" అనేవాడు.

తరువాత తరువాత కాలేజీకి రావడం కూడా

# పరీక్షా సమయం

- వారాల ఆనంద్



కథా నిలయం
శ్రీకాకుళం

తగ్గించాడు. ఒకరోజు వ స్తే రెండురోజులు రాకపోయేవాడు.

ఒకరోజు స్టాఫ్ రూముకు పిలిచి అడిగాను.

"ఏమిటయ్యా? ఏమిటిది? ఎందుకిలా తిరుగుతున్నావు? చదువు పాడయిపోవడం లేదా? ఎక్కడికి పోతున్నావిలా?"

"ఏంలేదు ...ఊరికెళ్ళా."

"ఊళ్ళో అమ్మకి గాని, నాన్నకి గాని బాగా లేదా?"

" మాఅమ్మ నాన్నే కాదు సార్. చాలా మంది చాలా రకాలుగా బాగాలేరు సార్!"

"నువ్వన్నదేమిటో నాకర్థం కాలేదు. కాని చూడు నారాయణా చదువెందుకు పాడు చేసుకుంటున్నావు? ఫైనల్లో నువ్వేదో ర్యాంకు వస్తావని మెడిసిన్ సీటు సంపాదించుకొని పైకొస్తావను కుంటుండే.. ఇలా నీకు నువ్వే భవిష్యత్తును నాశనం. చేసుకుంటే ఎలా? ఇకముందిలా తిరగకు. శ్రద్ధగా క్లాసులకు వచ్చిబాగా చదువు. కాలం

వృథా చేయకు"

"అవును సార్... మీ రనేది నిజం. బాగా చదవాలి- రెగ్యులర్‌గా జీవితాన్ని దగ్గరుండి మరీ చదవాలి. అదే ఆలోచిస్తున్నాను" అనివెళ్ళిపోయాడు.

నారాయణ ప్రవర్తన నాకు అనుమానం కలిగించింది. అతనేదో మత్తులో పడిపోయినట్టుగా, రాజకీయాల్లోకి దిగిపోయినట్టుగా అనిపించింది. ఏ విషయమూ తేల్చుకోవాలి అని అనుకుంటూ ఉండగానే-

నా ఆలోచన నిజమని తేలింది. ఓ రోజు హాస్టల్ వార్డెన్ స్టాఫ్‌రూంలో చెప్పాడు- "హాస్టలంతా పాడైపోయింది సార్! అంతా రాజకీయ మయం అయింది. రోజూ మీటింగులు, చర్చలు, రాత్రంతా ఇదేపని. వీటన్నింటికీ లీడరు ఆ నారాయణ.." అని.

"అవునా?" అనినేనేదో వివరణ అడుగబోతుండగానే మా తెలుగు లెక్చరర్- "చూశారా సార్! నారాయణ ఏదో పైకి వస్తాడనుకున్నాం. ఏం చేస్తాం? ఎవడి కర్మవాడిది" అన్నాడు.

మరో లెక్చరర్-"అంతే సార్! తిండికి లేనివాడికి హాస్టల్‌లో ఫ్రీగా తిండి, ఇక్కడ ఫ్రీగా చదువు,పైగా జేబుఖర్చుకి కూడా డబ్బులిస్తూంటే వాళ్ళెమైనా చదువుతారా, పాడా? ఎంత సేపు సినిమాలూ లేకపోతే రాజకీయాలూ వంటబడతాయి. అసలు మన ప్రభుత్వానికి బుద్ధిలేదు..." అంటూ ఏదో అంటున్నాడు.

ఈ మధ్యలో వార్డెన్-

"అవును సార్! నారాయణ చదువిక అంతే! అతనిమీద ఆశ వదులుకోవల సిందే!" అన్నా

## ప్రాక్టీసు

మొదటి వ్యక్తి—ఏమిట్రా, మనవాడు వ్యాయామం మానేసి చేతులు అడ్డం పెట్టి 'స్టాప్, స్టాప్' అంటున్నాడు?

రెండవ వ్యక్తి—ఏమీ లేదు—ట్రాఫిక్ పోలీసు ఉద్యోగం వచ్చిందట—ప్రాక్టీసు చేస్తున్నాడు.

—కె. రామశేషు

నేను మౌనంగా ఉండి పోయాను. ఎలా జరిగిందిది? పైకి రావలసిన విద్యార్థి ఇలా పాడై పోవడమేనా-నారాయణ ఎక్కడ గాడితప్పాడు? డాక్టరవుతాడనుకున్న వాడు ఎటూ కాకుండా పోవలసిందేనా? ఎటూ ఆలోచించక ఏమీ చేయలేక మనస్సంతా బాధతో మూలిగింది.

తరువాత తరువాత నారాయణ కాలేజీకి రావడం పూర్తిగా తగ్గించేశాడు. ఎప్పుడైనా వచ్చినా ఎక్కడెక్కడో తిరిగేవాడు. ఉన్నంత సేపూ విద్యార్థులతో చర్చలు, క్యాంటీన్‌లో మీటింగులు అలా నెలలు గడిచిపోయాయి.

* * * *

నెలరోజుల క్రితం జిల్లాలో ఓ మూల హఠాత్తుగా కలవరం కలిగించే సంఘటన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులెవరో రిటైర్డు కాని స్టేబుల్‌ని కాల్చి చంపేశారు. ప్రభుత్వం విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. జిల్లా అంతటా అనేక అరెస్టులు జరిగాయి. ఆ హత్య తీవ్రవాదుల పని అని ప్రభుత్వం విశ్వసించడంతో గాలింపు చర్యలు తీవ్రతరమయ్యాయి. దాంతో జిల్లా అంతా వారంపాటు ఉడికి పోయింది.

అలా అరెస్టు అయిన వాళ్ళలో నారాయణ కూడా ఉన్నాడనే వార్త కాలేజీలో గుప్పుమంది. ఊహించని పరిణామ మవడం వల్ల కలవరపడ్డాడు.

ఎంతపని జరిగిపోయింది! బాగా చదివి పైకి రావలసిన నారాయణ ఎవరి మాటలకో లొంగి ఎంతగా దెబ్బతిన్నాడు.! మనసంతా ఏదోలా అయిపోయింది.

"మన కాలేజీ విద్యార్థి కద సార్! విడిపించే ప్రయత్నం చేద్దాం."ప్రిన్సిపాల్‌తో అంటే- "బయట జరిగిన విషయాలకి మనమేమీ చెయలేం. పైగా ఇది పట్టి విషయం కూడా కాదు. మనకు చుట్టుకుంటే కష్టం" అన్నాడు ఆయన.

అలా స్టేషన్లో పడిన నారాయణని విడిపించే ప్రయత్నం ఎవరూ చేయలేదు.

వారం పదిరోజులతరువాత అనేక విషయాలు తెలిశాయి. నారాయణ అండర్ గ్రౌండ్ కార్యకర్తలతో సంబంధం పెట్టుకున్నాడనీ, ఏదో కుట్ర చేయబోతూ మరో ఇద్దరితో బాటు పోలీసులకి దొరికి పోయాడనీ పోలీసులు కేసు పెట్టగా డిస్ట్రిక్టు జైలులో ఉన్నాడనీ- అలా తెలిసిన ప్రతి విషయం కొత్తదే. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియక అయోమయంలో పడిపోయాను. ఆ తరువాత కొన్నాళ్ళవరకు నారాయణ గురించి ఏ విషయమూ తెలియలేదు. అలా కాలగమనంలో నారాయణని అంతా మరిచిపోయారు.

ఇలా గతంలో ఉన్న నేను-

-'సార్, అడిషనల్ పేపరివ్వండి!' ఎవరో విద్యార్థి


# కన్న బిడ్డలను నిందించరాదు

దిగువ సూచించిన పట్టికలో ఒక కారణమై యుండవచ్చుగదా!

- పలుమార్లు చదివినను, చెప్పినను గ్రహించేశక్తి క్షీణించి మందకొడి తనముగా యున్నారా!
- శ్రద్ధగా చదివి పరీక్షలు వ్రాయుటకు ఓపికలేక బెదురుపుట్టుచున్నదా!
- జ్ఞాపకశక్తి క్షీణించి యున్నారా! చదువు అనగానే గగుర్పాటుతో తప్పించుకొంటున్నారా!
- శరీరకముగా గాని మానసికంతో నీరసించి కృషించి యుంటున్నారా!
- మతిమరుపువలన వస్తువులు పెట్టిన చోటును మరచి నానా అవస్థలకు గురియగుచున్నారా!



మనస్సు విరక్తి చెందినవారికి నిరుత్సాహవంతులకు గుణపరచునది

**ANAC®**

అనాక్' హోమియోపతి మాత్రలు జ్ఞాపకశక్తి పెంపొందించును.

పిల్లలకు రూ. 10/- (10 వయస్సు లోపల)
పెద్దవారికి రూ. 15/-
రిజిష్టర్ ఖర్చు : 1 సీసా రూ.5/-
రిజిష్టర్ ఖర్చుతోచేర్చి M.O. చేయవలెను.
V.P.P. స్వీకరించబడదు.
నకిలీ చూసి మోసపోవద్దు.

HOMEO CLINIC & RESEARCH CENTRE
5, FIRST STREET,
SEETHA NAGAR,
NUNGAMBAKKAM,
MADRAS-600 034.

స్టాకిస్టులు కావలెను.

పిలవడం తో వాస్తవంలోకి వచ్చాను.

మళ్ళీ ఇన్నాళ్ళకి ఈ రోజున పరీక్షలు మొదలైన రోజున నారాయణ కాలేజీలో అడుగుపెట్టాడు. మామూలుగా కాదు- ఇరుప్రక్కలా ఇద్దరు కానిస్టేబుల్స్‌తో- ఆ దృశ్యమే తనని ఇంతగా కలవరపరచింది.

నారాయణ మేజిస్ట్రేటు స్పెషల్ పర్మిషను తీసుకుని పరీక్షలు రాయడానికి వచ్చాడన్నారెవరో.

ఏది ఏమైనా నారాయణతో మాట్లాడదామనీ, వాస్తవాలను తెలుసుకుందామనీ, నాలుగు మంచి మాటలు చెబుదామనీ అనుకుంటూ ఉంటే హాలు డ్యూటీ వల్ల అప్పటి నుంచీ వీలవడం లేదు. రిలీవర్ కోసం ఎదురు చూస్తూ ఉన్నాను. రిలీవర్ రాగానే పదినిముషాలు నా పంతు డ్యూటీ చేయమని చెప్పినారాయణని కలవడానికి బయలుదేరాను.

* * * *

గది ముందరే ఇద్దరు కానిస్టేబుల్స్ చెరోవైపు కూర్చుని కాపలా కాస్తున్నారు.

లోపలికి వెళ్ళగానే బెంచీమీద కుర్చున్న నారాయణో "నమస్తే సార్!" అన్నాడు.

"ఏం నారాయణ క్షేమమా?"

"క్షేమమే సార్. ఇట్లా ఉన్నాను.. మీరెట్లా ఉన్నారు?"

"కొంచెం మెల్లిగా మాట్లాడు."

"సారీ సర్!"

నారాయణ ఎంతగా మారిపోయాడు. కాలేజీక వచ్చేటప్పుడు నీటుగా ఉండి నవ్వుతూ నవ్విస్తూ ఉండే నారాయణలో ఇపుడెంత గాంభీర్యత కనిపిస్తోంది! ఆ గంభీర్యాన్ని చూస్తే ఒక్క క్షణం ఆశ్చర్యమేసింది. చదువుకుంటున్న విద్యార్థిలా కాకుండా ఎంతో పెద్దవాడిలా గడ్డం పెంచుకొని సీరియస్‌గా కనిపిస్తున్నాడు.

"ఏం సార్, అంత తీవ్రంగా చూస్తున్నారు!? వింతగా కనిపిస్తున్నానా?" చిర్నవ్వుతో మెల్లిగా అడిగాడు నారాయణ.

"అబ్బే అదేం కాదు. మునుపటి నారాయణైతే హాల్లో ఇలా కామ్‌గా ఏమీ రాయకుండా కూర్చునేవాడా? టైం సరిపోవడంలే దనుకుంటూ ఉండేవాడు కదా...అని ఆలోచిస్తున్నాను" అన్నాను.

"ఈ పరీక్షలకి నేనేమీ చదవలేదు...సార్!"

"అవును మరి, పెద్దవాడివి అయిపోయావు. చదువు మానేసి నువ్వు చేసిన పని నీ తల్లిదండ్రులను ఎంత బాధపెట్టిందో ఆలోచించావా? హాయిగా చదువుకుని పైకి వస్తే సంతోషించాలనే వారి ఆశల్ని తుంచేశావు...నీ పోషణలో సుఖపడదామనే వారి కోరికల్ని కాలరాచావు..." తెలీకుండానే నా గొంతులో కొంచెం కర్కశత్వం ధ్వనించింది.

నారాయణ ఒక్క క్షణం బాధపడ్డట్టుగా కనిపించి—మళ్ళీ వెంటనే యథావిధిగా మారి—

"మీరైనా నన్నర్థం చేసుకుంటా రనుకున్నాను. కాని మీరు కూడా తప్పుగానే ఆలోచించారు. సార్! మీరు బ్రతకడానికి ఏ విధంగానూ అక్కరకురాని బానిస చదువు గురించీ, బ్రతుక్కి ఏ విధంగా సరిపోని పలాయన విజ్ఞానం గురించీ, బ్రతుకుని ఏ విధంగానూ ప్రతిబింబించని పుస్తకాల్ని గురించీ చెబుతున్నారు. కాని నేను ప్రజా జీవితాన్ని చదవడానికి వెళ్ళాను. ఈ సామాజిక చరిత్రని, న్యాయాన్ని, ఆర్థిక అసమానతల్ని పరిశీలించడానికి వెళ్ళాను. మీరు మా అమ్మానాన్నలను గురించే కదా అంటున్నారు! నేను దేశంలోని లక్షలాది అమ్మానాన్నలను గురించి వెళ్ళాను. ఈ దేశంలో పేదరికాన్ని రూపుమాపడానికి ఏం చేయాలో, తమ శృంఖలాల్ని ఎలా తెంచుకోవాలో ప్రజలకి చెప్పడానికి వెళ్ళాను సార్!

"మీకు నేనంటే ఎంత అభిమానం ఉందో తెలుసు సార్! కాని మీరు ఒక్క క్షణం ఆలోచించండి—ఒక మా అమ్మా నాన్న కోసం కాకుండా లక్షలాది అమ్మా నాన్నల కోసం వెళ్ళిన నా దారిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. దేశం కోసం నేను చేస్తున్న పనులని, నా ఆలోచనలని అర్థం చేసుకోండి సార్..."

అంత స్థైర్యా ఆవేశంగా మాట్లాడిన నారాయణ మాటలు నన్ను ఆలోచనల్లో పడేశాయి. నారాయణ వాదన సమంజసమే అనిపించింది. మరుక్షణం ఆలోచనల్లోంచి తేరుకుని అడిగాను.

"మరి నిన్నింత తప్పుగా అర్థం చేసుకున్న మ అందరి మధ్యకీ ఎందుకూ పనికిరాని ఈ పరీక్షలకి ఎందుకొచ్చావు...?"

"సార్—నేనిపుడు చేయని నేరానికి శిక్ష అనుభవిస్తూ పరీక్షా సమయంలో ఉన్నాను. నేనే కాదు. ఇంకా అనేకమంది నాలానే ఇనుపగోడల మధ్య, కర్కశ పాశాల మధ్య నలుగుతూ పరీక్షకు లోనవుతున్నారు. మేమంతా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టేముందు వ్యవస్థ పెట్టే అడ్డంకుల్ని పరీక్షగా తీసుకుని పోరాడుతున్న వాళ్ళం. ఇంకొన్నాళ్ళు పోతేగాని తెలియదు ఈ పరీక్షల్లో మేమంతా నెగ్గేదీ, తప్పేదీ. ఈ పరీక్షలో నెగ్గి ముందుకెళితే ప్రజలు మమ్మల్ని గుండెలకు హత్తుకోవడానికి సిద్ధంగా ఎదురుచూస్తూ ఉంటారు. ఒకవేళ బలహీనంగా ఓడిపోతే వ్యక్తులుగా ఎవరికీ కనిపించకుండా పోతాము. కాని సార్, ఒకవేళ మేము ఓడిపోయినా మావెనుక వచ్చేవాళ్ళు తప్పకుండా గెలుస్తారు.

"ఇక మీ రన్నారే ఈ పరీక్షల కెందు కొచ్చావని. ఈ మూ డుగంటలూ మళ్ళీ నా పాత పరిసరాల్లో గడిపి పోదామని, న న్నభిమానించే మిత్రుల మధ్య, నన్నమితంగా ప్రేమించే నా గురువుల మధ్య గడిపి పోదామని వచ్చాను. నా ముందు వీటన్నింటినీ మించిన పరీక్ష ఉంది—అందులో నన్ను ఓడించడానికి అనేక శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రజల నుంచి నన్ను దూరం చేయడానికి భయంకర ప్రయత్నాలు జరుగుతున్నాయి— ఈ అడ్డంకులన్నీ దాటి నా ప్రజల్ని చేరడానికీ, నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచండి సార్! ఒకవేళ ఈ పోరాటంలో ఈ గెలుపు ఓటముల మధ్య నేను లేకుండా పోతే నా మీద మీకున్న ఆప్యాయతకి చిహ్నంగా ఒక కన్నీటి బొట్టు రాల్చండి సార్! చేతనైతే మరో దీపాన్ని వెలిగించే ప్రయత్నం చేయండి. అంతకుమించి నేనేమీ ఆశించను. మరి నేనిక వెళ్తాను సార్!" అంటూ నారాయణ లేచాడు.

ఇంతలో గంట మోగింది.

సెలవంటూ నారాయణ కానిస్టేబుల్స్‌తో కలిసి వెళ్ళిపోయాడు. అంతవరకూ నిశ్శబ్దంగా మా మాటల్ని వింటున్న గదంతా వేడి నిట్టూర్పు విడిచింది.

నా హృదయమంతా నారాయణే నిండిపోయాడు. ★

